
చాపరాయిలో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ


కామయ్యపేట,రాతులపుట్టు ప్రాంతంలో పొంగి ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ


మాకవరం వద్ద కల్వర్టుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు


మర్రిపుట్టు కాజ్‌వే పై ప్రవహిస్తున్న వరదనీరు

మన్యంలో పోటెత్తిన వరద

- పొంగిన వాగులు, గెడ్డలు
- గిరిజన గ్రామాలకు నిలిచిన రాకపోకలు..
- దెబ్బతిన్న గృహాలు.

డుంబ్రిగుడ/హుకుంపేట/ముంచంగిపుట్టు /పెదబయలు/చింతపల్లి/కొయ్యూరు /జి.మాడుగుల/ రంపచోడవరం/ వై.రామవరం/మారేడుమిల్లిరాజవొమ్మంగి: అల్పపీడన ప్రభావంతో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు వాగులు, గెడ్డలు వరదనీటితో ప్రవాహిస్తున్నాయి. గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నిత్యావసర సరకులు కోసం గిరిజనులు ఇక్కట్లు పడుతున్నరు. శనివారం అర్ధ రాత్రి నుంచి గత రెండు రోజులుగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సందర్శిత ప్రాంతాలు, జలాశయాల వద్ద ఎవరినీ రాకుండా రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పహారా కాస్తున్నారు. పంట పోలాలు పూర్తిగా నీట మునిగాయి. ఇసుకమేటలు పేరుకుపోయాయి. గెడ్డలు, వాగులు ఉధృతితో పాటు వంతెనలపై నుంచి వరదనీరు పొటెత్తడంతో రాకపోకలు స్తంభించాయి. పలుచోట్ల వంతెనలు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. ఇళ్లు నేలమట్టమయ్యాయి. బాధితులు నిరాశ్రయులయ్యారు. జనజీవనం అతలకుతమైంది.

కొట్టుకుపోయిన కల్వర్టులు, వంతెనలు

హుకుంపేట మండలంలోని కామయ్యపేట, గరుడాపల్లి ప్రాంతాల్లో మత్స్యగెడ్డ పొంగి ప్రవహిస్తుంది. ముంచంగిపుట్టు మండలంలోని గెడ్డల ఉధృతికి సుమారు 30 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కించాయిపుట్టు పంచాయతీ గడ్డిబంధ గ్రామంలో దడియా రమేష్ అనే గిరిజనుడి ఇంటిగోడలు కూలిపోయాయి. పెదబయలు మండలంలోని గెడ్డల ఉధృతికి సుమారు 50 గ్రామాలకు పైబడిన ప్రాంతాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. చింతపల్లి మండలంలోని పెద్దపైపు వద్దగల రేమల దివ్యశ్వరరావు ఇంటి ప్రహారితో పాటు మరుగుదొడ్లు నేలమట్టమయ్యాయి. లోతుగడ్డ జంక్షన్‌లో సుమారు 20 ఇళ్లలో వరదనీరు ముంచెత్తింది. కొయ్యూరు మండలంలోని సుమారు60 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. నర్సీపట్నం నుంచి మంప, రేవళ్లు రావలసిన బస్సులు, ఇటు నుంచి నర్సీపట్నం, రాజమహేంద్రవరం వెళ్లాల్సిన బస్సులు నిలిచిపోయాయి. నల్లగొండ వాగును నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు శివప్రసాద్ పరిశీలించి, స్థానికులకు పలు సూచనలిచ్చారు. జి.మాడుగుల మండలంలోని బొయితిలి పంచాయతీ సుబ్బులు-మండిభ గ్రామాల మధ్యలో ఉన్న బ్రిడ్జి వరద తాకిడికి కొట్టుకుపోయింది.కోరాపల్లి పంచాయతీ పెదజాగేరిలో వనగల రామారావు పెంకుటిల్లు వర్షానికి దెబ్బతింది, పసుపులంక గ్రామానికి చెందిన వెంకటరమణకు చెందిన ఇల్లు, మగబురుగు గ్రామానికి చెందిన పొంగి నీలమ్మకు చెందిన రేకుల ఇళ్లు పడిపోయింది. రంపచోడవరంలోని ఎర్రంరెడ్డి నగర్‌లో వర్షాలకు పెంకుటిల్లు కూలిపోయింది. వై.రామవరం మండలంలోని రాములుకొండ గ్రామ రైతు పల్లాల బాలురెడ్డికు చెందిన 5 ఎకరాల మొక్కజొన్న పంట నీట మునిగింది.మారేడుమిల్లిలోని సుమారు 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మాసీదోనియ చర్చి వీధిలోని విశ్వేశ్వరరావుకు చెందిన ఇంటిపై భారీ వృక్షం కూలిపడింది.మారేడుమిల్లి-కుండాడ, జీయవలస ప్రధాన రహదారి అడ్డంగా భారీ వృక్షం కూలిపడింది. మారేడుమిల్లి -చింతూరు ఘాట్ రోడ్డు రాకపోకలను నిలిపివేశారు. ఎస్‌ఐలు రాము, సాయి కుమార్ వాహనాలు రాకుండా చర్యలు తీసుకున్నారు. రాజవొమ్మంగి మండలంలోని 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

నిలిచిన ఇరు రాష్ట్రాల రాకపోకలు

ముంచంగిపుట్టు/చింతపల్లి: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు ప్రజలు కలిసి కాలినడక నడిచే సరిహద్దు ఐరెన్ వంతెనపై నుంచి భారీగా వరదనీరు ప్రవాహిస్తుంది. గడచిన 15 ఏళ్లుగా ఇంత వరదనీరు చేరలేదని పలువురు చెబుతున్నారు. చింతపల్లిలోని అప్రోచ్ రోడ్డులు కొట్టుకుపోవడంతో అంతర్ రాష్ట రహదారిలో రాకపోకలు సాగించడానికి అతరాయం కలిగింది. నర్సీపట్నం నుంచి చింతపల్లి మీదుగా సీలేరు, చిత్రకొండ, హైదరాబాదు వంటి ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు అంతరాయం కలిగింది.


గుల్లేలు గెడ్డ దాటవద్ద ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి గోమంగి రెవెన్యూ సిబ్బంది


లోతుగడ్డ జంక్షన్‌లోని ముంచెత్తిన వరదనీరు


నెల్లిమెట్ల వద్ద వాగు ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు


వంతెనపై నుంచి ప్రవహిస్తున్న కాకరపాడు కాలువ


ముంచంగిపుట్టు ఏవోబీ సరిహద్దు వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు


జి.మాడుగులలో నీట మునిగిన పంట


మద్దిగరువులో పొంగి ప్రవహిస్తున్న గెడ్డ


శింగవరంలో నీట మునిగిన మొక్కజొన్న పంట


కుండాడ, జీఎంవలస రహదారిలో కూలిన చెట్టును తొలగిస్తున్న యువత


మారేడుమిల్లిలో వీధిలో ఓ ఇంటిపై కూలిన చెట్టు

ఘనంగా వినాయకుని నిమజ్జనం


డుంబ్రిగుడలో నిమజ్జన ఊరేగింపులో థింసా నృత్యం చేస్తున్న గిరిజనులు


రూడకోటలో నిమజ్జన ఊరేగింపులో సందడి


రాజవొమ్మంగిలోని నిమజ్జనోత్సవంలో భక్తులు

డుంబ్రిగుడ/పెదబయలు/రాజవొమ్మంగి: వినాయక చవితి ఉత్సవాలు సోమవారం నాటికి మూడవ రోజుకు చేరుకొన్నాయి. జిల్లా వ్యాప్తంగా వినాయక ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. జిల్లాలోని డుంబ్రిగుడ, పెదబయలు, రాజవొమ్మంగి మండలాల్లో గణనాథుని నిమజ్జన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. డుంబ్రిగుడలోని చాపరాయి జలపాతం వద్ద వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకునికి సమీప గెడ్డలోని నిమజ్జనం చేశారు. ఈ ఊరేగింపులో థింసా నృత్యాలు చేశారు. వినాయకుని లడ్డూకు వేలంపాట నిర్వహించారు. స్థానిక వ్యాపారి సత్తిరాజు రూ.500లకు దక్కించుకున్నారు. భారీ అన్నసమారాధన జరిగింది. వర్తక సంఘం అధ్యక్షుడు సుమన్, సత్తిరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. పెదబయలు మండలంలోని రూడకోట పంచాయతీలో సర్పంచ్ కాతారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో వినాయకుని నిమజ్జన వేడుకలు జరిగాయి. ఊరేగింపులో యువకులు, చిన్నారులు సందడి చేశారు. రాధాకృష్ణ, సింహాచలం, ఉత్సవ కమిటీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు. రాజవొమ్మంగిలోని కొన్నిచోట్ల సోమవారం నిమజ్జన ఉత్సవాలు వైభవంగా జరిగాయి. స్థానిక శ్రీకోదండరామస్వామి ఆలయం ఊరేగింపు సాగింది. స్థానిక వట్టిగెడ్డ వాగులో గణనాథుని విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


వై.రామవరం సీహెచ్‌సీలో గర్భిణికి స్కానింగ్ చేస్తున్న వైద్యాధికారులు

వై.రామవరం: పీఎంఎస్ఎంపీఏ కార్యక్రమంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం 45 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్‌లు, రక్తపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వారిలో నలుగురు హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో చేర్పించారు. వారికి ప్రత్యేక వైద్య సేవలతోపాటు, అవసరమైన మందులు అందించారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన గర్భిణులకు భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ హారిక, సీహెచ్‌సీ వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో కూడా వైద్యాధికారుల నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో గర్భిణీలకు స్కానింగులు, ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

రంపచోడవరం: తీవ్ర వర్షాలతో ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, పీహెచ్‌సీల్లో వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి అన్నారు. వాడపల్లి పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీదేవి మాట్లాడుతూ జ్వర బాధితులున్న ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పీహెచ్‌సీలో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఆస్పత్రి ఆవరణను ఉపాధి హామీ పథకంలో శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గర్భిణులు, రోగులకు ఎంపీపీ శ్రీదేవి తన సొంత ఖర్చులతో జ్యూస్ బాటిళ్లు, రొట్టెలను అందజేశారు. ఎంపీటీసీల సభ్యులు బచ్చల మంగయమ్మ, వంశీ కుంజం, వైద్యులు డాక్టర్, షాహిని, నిర్జన్, సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన


ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను పరిశీలిస్తున్న ఎంపీపీ అనూషదేవి, ఎంపీడీవో ఆశాజ్యోతి

చింతపల్లి: అల్పపీడన ప్రభావంతో కురుసున్న భారీ వర్షాలకు నష్టం వాటిల్లిన ప్రాంతాలను ఎంపీపీ అనూషదేవి, ఎంపీడీవో ఆశాజ్యోతి సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా లంబసింగి ఘాట్ రోడ్డులో వర్షాలకు కొండపై నుంచి రోడ్డు పైకి వచ్చిన కొండచరియల (బండరాళ్ల)ను, బలభద్రం వాగును పరిశీలించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఆదివారం రాత్రి కురసిన వర్షాలకు రాజుపాకలు, చింతలూరు కల్వర్టలను పరిశీలించి సాధ్యమైనంత త్వరలో రాకపోకలు సాగించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

సురక్షిత ప్రాంతాల్లో మోడల్ కాలనీ నిర్మించాలి


స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు

అరకులోయ రూరల్: కొండవాగు గ్రామల గిరిజనులకు సురక్షితమైన ప్రాంతాల్లో మోడల్ కాలనీలు ఏర్పాటు చేయాలని సీపీఎం, వైఎస్సార్‌సీపీ నాయకులు రామారావు, ఉమామహేశ్వరావు, బాలరాజు చెప్పారు. మాడగడ గ్రామంలో వారు సోమవారం సందర్శించారు. ఇటీవల వర్షాల కారణంగా గ్రామంలో ఇళ్లు దెబ్బతిన్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ శివారు గ్రామాల్లో ఉన్న గిరిజనులకు సురక్షితమైన ప్రాంతాల్లో మోడల్ కాలనీలు నిర్మించాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని మోడల్ కాలనీల నిర్మాణానికి శ్రీకారం చుట్టాలన్నారు.

కొండుపోడు పట్టాలు, ఇళ్లు మంజూరు చేయాలి


నిరసన తెలుపుతున్న గిరిజనులు

అరకులోయ రూరల్: మండలంలో సుంకమెట్ట పంచాయతీ దాబుగుడ గ్రామంలో సోమవారం గిరిజన సంఘం నాయకులు పర్యటించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు చిన్నబాబు మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులకు పీఎం జన్‌మన్ వికాస్ యోజన పథకం ద్వారా అర్హులకు కొండపోడు పట్టాలు మంజూరు చేయాలన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొంత మంది గృహాల నిర్మాణం చేసుకున్న వారి ఖాతాలో డబ్బులు జమ చేయాలన్నారు. పీఎం జన్‌మన్ పథకం ద్వారా ఇల్లు నిర్మాణానికి ఇస్తున్న రూ.2.39లక్షల సరిపోవని ఐదు లక్షలకు పెంచాలన్నారు, బిల్లుల పేరుతో సంబంధిత అధికారులు గృహాల నిర్మాణంలో నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. గ్రామస్తులు ఆనంద్, ప్రేమ్‌కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ రిట్రీట్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ అవిష్కరిస్తున్న సంజీవ్‌కుమార్, పాస్టర్లు

అరకులోయ రూరల్: మండలంలో మాడగడ పంచాయతీ బెంజిపూర్ గ్రామంలోని లూథరన్ మిషన్ చర్చి ఆవరణలో అక్టోబర్11న యూత్ రిట్రీట్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు లూథర్ మిషన్ చర్చి డైరెక్టర్ సంజీవ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఆ కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూత్ రిట్రీట్‌లో ఆధ్యాత్మిక సందేశం, బైబిల్ పరీక్షలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారందరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం 6281375679 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కిషోర్, యేసుపాదం, రవికిరణ్ పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న సురేంద్ర, బాలదేవ్

అరకులోయ రూరల్: ఇటీవల తుపాను కారణంగా అల్లూరి జిల్లాలో గూడెంకొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామానికి చెందిన కొర్రా కుమారి, మృతి చెందగా మరో ముగ్గురు తీవ్ర గాయలతో చికిత్స పొందుతున్నారి, ఆయా బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవలని గిరిజన సంఘం రాష్ట ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రదాన కార్యదర్శి బాలదేవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తుపాను ప్రభావంలో ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఏజెన్సీలో కొన్నిచోట్ల కొండచరియలు విరిగిపడుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. అవసరమైన చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, తక్షణమే మృతుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు.

ముంపు పంటలపై సర్వే

మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్


పంటను పరిశీలిస్తున్న సిబ్బంది

పెదబయలు: తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగి వరి పంట పొలాలు ముంపునకు గురైయ్యాయని, ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు రోజుల నుంచి సర్వే చేస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాస్ తెలిపారు. మండలంలో 16 గ్రామ సచివాలయాల పరిధిలో 64 రెవెన్యూ గ్రామాల్లో సుమారు 850 ఎకరాల వరి పంట ముంపునకు గురైనట్టు క్షేత్రస్థాయి సర్వే ద్వారా తెలిసిందన్నారు. వరద ఉధృతి తగ్గిన తరువాత నష్టాన్ని పూర్తిస్థాయిలో నిర్ధారిస్తామన్నారు. వరి పొలాల్లో వరద నీరు బయటకు వెళ్లడానికి కాలువలు తీసుకోవాలని రైతులను సూచించారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో పొలాలకు వెళ్లొద్దని, జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం


డుంబ్రిగుడ గ్రామంలోని కొండ

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని డుంబ్రిగుడ శివారులో ఉన్న కొండ ప్రాంతంలో కొండచరియలు పడే ప్రమాదం పొంచి ఉంది. హైవే 516 రహదారి కోసం ఈ కొండలో ఉన్న ఎర్ర మట్టిని తవ్వారని, దీంతో చిన్న పాటి వర్షం కురిసినా గ్రామానికి వరద ముంచేస్తుందని పలువురు చెబుతున్నారు. గతంలో 1991, 2009 తుపాను సమయాలతో పాటు 2014 హుద్‌హుద్ తుపానులో కొండచరియాలు పడ్డాయని గుర్తుచేస్తున్నారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షలకు గత రెండు రోజులుగా కొండ మట్టి నాని ఉందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ స్థానికులు ఆందోళనతో ఉన్నారు. అధికారులు స్పందించి కొండలో గ్రిల్స్ ఏర్పాటు చేయడమో లేక మరో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదంలో విద్యార్థికి గాయాలు


గాయపడిన ఆనంద్

కొయ్యూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థి మువ్వల ఆనంద్‌ను సోమవారం సాయంత్రం 108లో నర్సీపటనం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బూదరాళ్ల నుంచి కొయ్యూరుకు మువ్వల మున్నతో కలిసి ఆనంద్ బైక్‌పై వస్తున్నాడు. మర్రివాడ సమీపంలో బైక్ అదుపుతప్పడంతో ఇద్దరు రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో ఆనంద్‌కు తల, ముక్కుపై తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ఆనంద్ చికిత్స పొందుతున్నాడు.

సీఐగా గోపాలకృష్ణ బాధ్యతల స్వీకరణ


సీఐ గోపాలకృష్ణ

మారేడుమిల్లి : మారేడుమిల్లి సీఐగా హెచ్.గోపాలకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణపై ప్రతిష్టమైన నిఘా ఏర్పాటు చేసి, నిర్మూలనకు కృషి చేస్తామని తెలిపారు. కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పటి వరకు సీఐగా పనిచేసిన రుద్రరాజు భీమరాజు పి.గన్నవరం బదిలీపై వెళ్లారు.

అప్రమత్తంగా ఉండాలి


గెడ్డ వాగులను పరిశీలిస్తున్న సీఐ హిమగిరి, తహసీల్దార్ వేణుగోపాల్


బండిగడ్డ గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును పరిశీలిస్తున్న సీఐ నరసింహమూర్తి


అరకులోయలోని గెడ్డ వద్ద గ్రామస్తులు


రాజవొమ్మంగిలో పొంగి ప్రవహిస్తున్న వాగు పరిశీలిస్తున్న ఎంపీడీఓ యాదగిరీశ్వర్రావు

అరకులోయ రూరల్/జి.మాడుగుల/ముంచంగిపుట్టు/పెదబయలు/వై.రామవరం/రాజవొమ్మంగి: జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ మేరకు ఆయా వాగుల వద్ద ఎటువంటి రాకపోకలు సాగకుండా రెవెన్యూ శాఖాధికారులు, పోలీసులు పహారా కాస్తున్నారు. అధికారులు మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గెడ్డలు, వాగులు దాటే ప్రయత్నాలు చేయవద్దని హెచ్చరిస్తున్నారు. అరకులోయలో తహసీల్దార్ వేణుగోపాల్, సీఐ హిమగిరి, వై.రామవరంలో ఎంపీడీవో బాపన్నదొర, అడ్డతీగల సీఐ నరసింహమూర్తి, ఎస్‌ఐ సంతోష్‌కుమార్, రాజవొమ్మంగిలో ఎంపీడీవో యాదగిరీశ్వర్రావు , సీఐ సన్యాసినాయుడు, జి.మాడుగులలో ఎంపీడీవో లోహిత్ జయసాగర్ తదితరులు పర్యవేక్షించారు. వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని వైఎస్సార్‌సీపీ మహిళ విభాగ జిల్లా అధికార ప్రతినిధి కొర్రా రాధిక చెప్పారు.


వంజరి రోడ్డు బ్లాక్ చేస్తున్న మహిళా పోలీస్


ముంచంగిపుట్టులోని గెడ్డ వద్ద పర్యవేక్షిస్తున్న అధికారులు

వరినాట్లలో మెలకువలతో అధిక దిగుబడి


కాశీపురంలో వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు బృందం

దేవరాపల్లి : వరి నాట్ల సమయంలో చిన్నపాటి మెలకువలు పాటించడం ద్వారా ఆశాజనకంగా దిగుబడులు సాధించవచ్చని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని కాశీపురం, నాగయ్యపేట, రైవాడ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మతో కలిసి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.ఆదిలక్ష్మి, మరో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి. చంద్రశేఖర్ సోమవారం పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. 50 నుండి 60 రోజుల వయసున్న వరి నారును నాట్లు వేయాల్సి వస్తే పిలకలు దగ్గర దగ్గరగా వేసుకోవాలని సూచించారు. వరి నాట్లు వేసే ముందు దమ్ములో ఎకరానికి 50 కేజీల డీఏపీ, 15 కేజీల పొటాష్ వేసుకోవాలన్నారు. నాట్లు వేసిన తర్వాత 15 కేజీల యూరియా, మరలా 35 రోజుల తర్వాత 15 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ కలిపి వేసుకోవడం ద్వారా పంట దిగుబడి బాగుంటుందని రైతులకు వివరించారు. కిరణ్‌కుమార్, రామానాయుడు తదితరులు ఉన్నారు.